# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర రహదారులు భవనాల శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహిస్తారు.**

2. **రాష్ట్రంలో అతిసార వంటి ఇతర కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, చికిత్స, నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది.**

3. **వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు.**

4. **రాష్ట్రవ్యాప్తంగా అన్ని న్యాయ స్థానాల్లో రేపు జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నారు.**

==========================

రాష్ట్ర రహదారులు భవనాల శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహిస్తారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించే ఈ సమీక్షలో రాష్ట్ర రహదారులతో పాటు జాతీయ రహదారులపై చర్చించనున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యం– పీపీపీ విధానంలో రహదారులను అభివృద్ధి చేయడంపై అధికారులతో చర్చించనున్నారు.

ఇదిలా ఉండగా, రాష్ట్రంలో రహదారుల మరమత్తు పనులను మొదలుపెట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నిన్న సచివాలయంలో రహదారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలు, వరదలకు గండ్లుపడి, తెగిపోయిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. రోడ్ల మరమ్మతులు, నిర్మాణంలో కొత్త సాంకేతికతను వినియోగించుకోవాలని, తక్కువ ఖర్చుతో నాణ్యమైన రహదారులను నిర్మించడంపై దృష్టి సారించాలని తెలిపారు. రాష్ట్రమంతటా రహదారుల గణాంకాల సమాచారాన్ని సేకరించాలని సూచించారు.

-------------------------

రాష్ట్రంలో అతిసార వంటి ఇతర కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, చికిత్స, నిర్వహణ కోసం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ అధ్యక్షతన వైద్య శాఖ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీలో పంచాయతీరాజ్, పురపాలక శాఖ కమిషనర్లు, పాడేరు ఐటీడీఏ పీవో సహా 9 మంది సభ్యులను నియమిస్తూ వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వ్యాధుల వ్యాప్తి జరగకుండా తీసుకోవాల్సిన

నియంత్రణచర్యలు, సంబంధిత శాఖలను సమన్వయ పరచడం వంటి విధులను కమిటీ నిర్వహిస్తుందని తెలిపారు. వ్యాధుల నియంత్రణకు ప్రభావవంతమైన నిర్దిష్ట చికిత్సా విధివిధానాలను రూపొందించేందుకు, మరణాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

---

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు. ఏలేరు వరద ప్రభావిత గ్రామాలైన నాగులపల్లి, రమణక్కపేటలోని బాధితులను పరామర్శించి వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఏలేరు వరదతో కాకినాడ జిల్లాలోని మూడు నియోజకవర్గాలపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. వరద వల్ల పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారాన్ని ప్రకటించాలని కోరారు.

---

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయ స్థానాల్లో రేపు జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సభ్య కార్యదర్శి ఎం. బబిత తెలిపారు. ప్రజలు, కక్షిదారులకు దగ్గరలో ఉన్న న్యాయ స్థానాల్లో లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తారని వివరించారు. న్యాయస్థానాల్లో రాజీపడదగిన అన్ని రకాల సివిల్ కేసులు, క్రిమినల్ కేసులన్నింటినీ ఈ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని కోరారు. రాజీకి అవకాశమున్న కేసులలో సత్వర పరిష్కారం పొందేలా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

---

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల ఆస్తి నష్టాలకు సంబంధించిన బీమాను పొందేందుకు విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కేంద్రం శని, ఆదివారాల్లోనూ పనిచేస్తుందని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. ప్రజలకు ఉపయోగపడేలా సెలవురోజులైన శని, ఆదివారాల్లో కూడా కేంద్రం పనిచేసేలా ఏర్పాట్లు చేశామని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీమా ప్రతినిధులు అందుబాటులో ఉంటారని, అన్ని రకాల బీమా సంస్థల ప్రతినిధులు ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో ఉంటారని, బీమా చేసుకున్న ఆస్తులు నష్టపోయిన, దెబ్బతిన్నవారు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

---

పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.వి.రమణ. తెలిపారు. ఈరోజు తిరుపతిలో నిర్వహించిన ఏక్ పేడ్ మా కే నామ్.. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎం.వి.రమణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో ప్రభుత్వ పాఠశాలలలో, విద్యార్థుల చేత మొక్కలు నాటిస్తున్నామని తెలిపారు. తల్లి పేరుతో మొక్క నాటడం ఎంతో స్ఫూర్తిని నింపడంతో పాటు పర్యావరణంపై అవగహన కల్పించేందుకు దోహపడుతుందని పేర్కొన్నారు.

---

మహిళా సాధికారత, సంక్షేమం కోసం మహిళా కమిషన్ కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ జి.వెంకట లక్ష్మి అన్నారు. కడప కేంద్ర కారాగారంలో మహిళా ఖైదీల వార్డులను ఈ రోజు ఆమె పరిశీలించి, వారితో మాట్లాడారు. అనంతరం జి.వెంకట లక్ష్మి పాత్రికేయులతో మాట్లాడుతూ, కారాగారంలో మహిళలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలపై జరుగుతున్న నేరాలను నిలువరించేందుకు ప్రభుత్వంతో కలిసి రాష్ట్ర మహిళా కమిషన్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

---------------------------

భారతీయ రైల్వే అందించే ప్రతిష్టాత్మక నాన్ సబర్బన్ గ్రూప్ ఎన్ఎస్జీ-1 హోదాను విజయవాడ రైల్వే స్టేషన్ సాధించిందని విజయవాడ డివిజినల్ రైల్వే మేనేజర్ -డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. దేశంలోనే తొలి 28 స్టేషన్లలో ఒకటిగానూ, దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ తరువాత రెండో స్టేషన్‌గా ఘనత సాధించిందని చెప్పారు. 500 కోట్ల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం లేదా 20 మిలియన్ల ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న స్టేషన్లకు ఎన్ఎస్జీ-1 హోదా వస్తుందన్నారు. కాగా 2023-24లో రైల్వేబోర్డు సమీక్షలో విజయవాడ స్టేషన్ అత్యధికంగా 528 కోట్ల రూపాయల వార్షిక ఆదాయంతో 16.84 మిలియన్ల ప్రయాణికులను కలిగి ఉండడంతో రైల్వేశాఖ ఎన్ఎస్జీ-1 హోదా ప్రకటించిందని డివిజన్‌కు ప్రతిష్టాత్మక హోదా రావటం గర్వకారణమన్నారు.

---------------------------

మహిళలు, చిన్నారులు, గర్భిణీ స్త్రీలలో రక్తహీనతను నివారించేందుకు పోషకాహారం దోహదపడుతుందని రాష్ట్ర మహిళా ఛైర్మన్ జి.వెంకట లక్ష్మి తెలిపారు. కర్నూలులో నిర్వహించిన జాతీయ పోషణ మాసోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ, జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా రక్తహీనత, చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటుంన్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో అంగనవాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార ప్రాధాన్యం, సమస్య నివారణకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కొలువైన కొత్తమ్మ తల్లి జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తించిన నేపథ్యంలో అక్టోబరు 1 నుంచి 3 వరకు ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిన్న శ్రీకాకుళంలో జాతర ఏర్పాట్లపై అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రముఖ ఆలయాల తరహాలో క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వంద మీటర్లకు తాగునీరు, పాలు వంటి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రధానమంత్రి ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహ అభియాన్ -పీఎం జన్ మన్ పథకం ప్రతిపాదనలపై తుది నివేదిక అందించాలని పార్వతీ పురం మన్యంజిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సంభంధిత అధికారులను ఆదేశించారు. నిన్న కలెక్టర్ కార్యాలయంలో జన్ మన్ పథకం ప్రతిపాదనలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జన్ మన్ పథకం ద్వారా గిరిజన గ్రామాలకు అవసరమైన కనీస సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమం క్రింద అవగాహన కార్యక్రమాలను నిర్వహించి గ్రామస్తుల అవసరాలు గుర్తించాలని అధికారులకు సూచించారు.

-----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేష సాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 15 సెకన్లు....

-----------------------------

ప్రకాశం జిల్లాలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నామని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణపై ఒంగోలులో జిల్లా మండల అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా మానవహారాలు, స్వచ్ఛతా పరుగు వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగంగా తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యానవనాలు, పర్యాటక కేంద్రాల సుందరీకరణ వంటి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

======================